# అన్నమయ్య భావనలో హనుమన్న

- కొలవెన్ను మలయవాసిని

శ్రీ మద్రామాయణం పేరు వినగానే సీతారాములతోపాటుగా అందరి మనసులో మెదిలే మహానుభావుడు హనుమంతుడు. నిజానికి రామాయణంలో కిష్కింధకాండ వరకు హనుమ ప్రస్తావన ఉండదు. కిష్కింధకాండలో 'సంభ్రమమ్‌త్యజతామ్' అంటూ హనుమ ప్రవేసిస్తాడు. సీతాన్వేషణతత్పరులై వస్తున్న రామలక్ష్మణులను దూరంనుండి చూసిన సుగ్రీవుడు ఈ వీరుల్ని వాలి పంపాడేమో నన్ను చంపడానికి అని కంగారుపడుతుండగా 'కంగారు వదలండి, భయంలేదు' అంటూ హనుమ సుగ్రీవుని చేరవస్తాడు. ఆ అభయం హనుమ సుగ్రీవుడికి ఒక్కడికేకాదు, సమస్తప్రాణికోటికిపలికాడా అనిపిస్తుంది. హనుమ కథలోకి ప్రవేశించాక అతని భుజస్కంధాలమీదనే రామకథ నడుస్తుంది. అంతటి ప్రాధాన్యంగల హనుమ సుగ్రీవునికి మంత్రి. శ్రీ రామచంద్రునికి బంటు, దూత, దాసు. దాసభక్తికి హనుమ ప్రథమోదాహరణం. రామకథలో–రామదూతగా రాముని క్షేమసమాచారంసీతకు, సీతస్థితిగతులు శ్రీరామునికి ఎరిగించినపుణ్యమూర్తి. సంజీవనిని తెచ్చి లక్ష్మణుణ్ణి, వానరుల్ని బ్రతికించిన ప్రాణదాత. అంతటి సుగుణ గణ్యుడైన హనుమయ్యను అన్నమయ్య సంభావించినతీరు, ఆవిష్కరించిన పద్ధతి నవీనగుణసనాథంగా, దివ్యభావోపేతంగా ఉన్నాయి. హనుమ నిర్వర్తించిన కార్యక్రమాలను, హనుమ జీవితవిశేషాలను అన్నమయ్య తన కీర్తనలలో పదేపదే కొనియాడాడు.

రామకార్య నిర్వహణలో హనుమ ప్రదర్శించిన నేర్పు, ఓర్పు వెలకట్టరానివి. 'రామబంటు'గా హనుమన్నకున్న కీర్తి, స్థానం మరి ఎవరికీ లేవు. బంటు అంటే రామబంటు హనుమంతుడే. తెలుగువారి వాడుకలో–బంటు అంటే–సేవకుడనీ, భక్తుడనీ, శిష్యుడనీ, శూరుడని అర్థాలు వున్నాయి. ఈ నాలుగు అర్థాలూ హనుమకు అన్వయిస్తాయి. అయితే సేవకుడు అనే అర్థంలోనే త్యాగయ్య, అన్నమయ్యకూడా ప్రయోగించారు. త్యాగరాజు బంటురీతి కొలువు ఇయ్యవయ్యరామా? అని ప్రార్థించాడు. అన్నమయ్య బంటుగా హనుమచేసిన కార్యక్రమాలను గమనించి పులకించి హనుమను కీర్తించాడు. నమ్మకమయిన బంటుగా ఎనలేని కీర్తిని ఆర్జించడం సామాన్యవిషయం కాదు. బంటు అంటే ఎవరో ఎలావుండాలో చెప్తూ అట్టి బంటు హనుమంతుడు– అంటూ పల్లవిలో నొక్కివక్కాణిస్తాడు అన్నమయ్య.

ఆ కీర్తన: గౌళరాగం

అటిముటి హనుమంతుడట్టి బంటు
వెఱపులేనిరఘువీరునికి బంటు :పల్లవి:

1.యేలికను దైవముగా నెంచి కొల్చేవాడే బంటు
తాలిమి గలిగిన యాతడే బంటు
పాలుమాలక యేపొద్దుపని సేయువాడే బంటు
వేళ గాచుకవుండేటి వెరవరే బంటు :అటిముటి:

2. తను మనోవంచన లెంతటా లేనివాడే బంటు
ధనము పట్టున శుద్ధాత్మకుడే బంటు
అనిశము నెదురు మాటాడని వాడే బంటు
అనిమొనందిరుగని యతడే బంటు :అటిముటి:

3. చెప్పినట్లనే నడచిన యాతడే బంటు
తప్పులేక హితుండై నాతడే బంటు
మెప్పించుకు విశ్వాసానమెలగువాడే బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుడే బంటు :అటిముటి:

4. అక్కర గలిగి కడు నాప్తుడైన వాడే బంటు
యెక్కడా విడిచి పోని యిష్టుడే బంటు
తక్కర రహస్యములు దాచినవాడే బంటు
కక్క సీడు గాక బత్తిగలవాడే బంటు :అటిముటి:

5. కానిపనులకు లోను గానివాడే బంటు
ఆనాజ్ఞ మీరని యాతడే బంటు
నానాగతి శ్రీ వేంకటోన్నతుడైన యాతనికి
తానన్నిటా దాసుడైన ధన్యుడే బంటు :అటిముటి:

ఆధ్యాత్మసంకీర్తనలు–4వ సంపుటము– 278 కీర్తన

ఈ కీర్తనలో అన్నమయ్య 'బంటు' లక్షణాలన్నిటిని స్పష్టంగా చెప్పాడు. బంటు ఎలా వుండాలో సర్వాత్మనా అలా ఉన్నవాడు నిస్సందేహంగా– ఆశ్చర్యంగా హనుమంతుడే అని నిర్ధారించాడు.

'అటిముటి హనుమంతుడు అట్టిబంటు' అంటే అదే అర్థం. ఎట్టి బంటో తెలిసింది. మరి ఎవరి బంటో చూద్దాం. 'వెరపులేని రఘువీరునికి బంటు' అంటాడు అన్నమయ్య మామూలు మాటగ. దేనికీ భయపడని రఘువంశవీరుడైన శ్రీరామునికి బంటుట. సత్యధర్మాలు నిర్వహించడంలో వెరపులేని మహావీరుడు శ్రీరాముడు. హనుమంతుడు తనను తాను పరిచయం చేసుకునే సందర్భంలో వాల్మీకి రామాయణం, సుందరాకాండలో– 'దాసోహం కోసలేంద్రస్యరామస్యాక్లిష్టకర్మణః' అని. ఏపనినైనా అవలీలగా చేసే శూరుడైన కోసలాధిపతి రాముని దాసుణ్ణి నేను–దూతోహమితి విజ్ఞాయో రాఘవస్యమిత తేజసః. అమిత తేజోవంతుడైన రాముని దూతగా తెలుసుకో అంటూ వీరుడైన రాముని దాసుడననీ, దూతననీ చెప్పిన వాల్మీకి వచనాన్ని–యథాతథంగా–

అచ్చతెనుగులో 'వెరపులేని రఘువీరునికి బంటు' అంటూ అనువదించాడు అన్నమయ్య.

మొదటి చరణంలో చెప్పిన విషయాలు- ఎవరు తన యజమానిని భగవంతునిగా కొలుస్తాడో వాడే బంటు. ఎవరికి ఓర్పు ఉంటుందో వాడే బంటు. తాను కోపం తెచ్చుకునో కంగారు పడో సమయం కాని సమయంలో కాని పనులు చేస్తే కార్యం మొదటికే చెడవచ్చు. కాబట్టి తాలిమికలవాడే అంటే ఓర్పుగలవాడే బంటు.

పాలుమాలకయే పొద్దుపని చేయువాడే బంటు-- అంటే పని మర్చిపోవడం, తరవాత చేద్దాంలే అని వాయిదావెయ్యకుండా, బద్ధకించకుండా, యేపొద్దు-ఏరోజూ కూడా చేయవలసిన కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేసేవాడే బంటు.

వేళకాచుకవుండే వెరవరే బంటు- తాను చేయబోయే పనికి తగిన సమయం కోసం వేచి కార్యం సాధించే ఉపాయశాలే బంటు. వెరవరి అంటే ఉపాయశాలి అని అర్థం. సముద్రలంఘన సమయంలో ఉపాయంగా సురసను, ఛాయాగ్రాహిని జయించిన ఉపాయశాలి హనుమ. వేళగాచుకు ఉన్న వెరవరిగా అడుగడుగునా దర్శనమిస్తాడు హనుమ. ఏలికను దైవముగా నెంచి కొల్చేవాడు హనుమ అనడంలో అతిశయోక్తిలేనేలేదు.

కాబట్టి ఈ చరణంలో చెప్పిన బంటు లక్షణాలన్నీ ఉన్న- 'అటిముటి హనుమంతుడు అట్టి బంటు!' అంటూ నిర్ధారించాడు అన్నమయ్య.

ఇక రెండో చరణం: తనుమనోవంచనలెంతటాలేనివాడే బంటు- చేయవలసిన పనుల్లో ఒళ్ళు దాచుకోకుండా పనిచేసేవాడే బంటు. మనసులో ఒక ఆలోచన, పైకి చెప్పిన విషయం ఒకటి కాకుండ వ్యవహరించేవాడే బంటు. తనుమనోవంచన అంటే ఒడలు, మనసు విషయంలో మోసం చెయ్యడం-అది లేనివాడే బంటు.

'ధనము పట్టున శుద్ధాత్మకుడే బంటు'-డబ్బు విషయంలో ఏరకమైన పాపపు ఆలోచన లేనివాడై ఉండాలి.

'బంగారం చూస్తే బ్రహ్మకైన పుట్టు రిమ్మతెగులు' అన్నారు అనుభవజ్ఞులు. కాబట్టి ధనము విషయంలో శుద్ధాత్మకుడై ఉండాలి.

'అనిశము నెదురు మాటాడనివాడే బంటు'-ఏసందర్భంలోనూ -ఎప్పుడూ యజమాని మాటకు ఎదురుచెప్పనివాడే బంటు.

'అనిమొనందిరుగని యతడే బంటు'-

మామూలు సమయంలో ఎన్నో ప్రగల్భాలు పలికి, తీరా నిజంగా పోరాడవలసి వచ్చినప్పుడు యుద్ధం ప్రారంభంలోనే పారిపోనివాడే బంటు.

అనిమొనలో- యుద్ధరంగంలో అగ్రభాగంలో తిరిగిపోకుండా నిలిచేవాడు హనుమ. 'అని' అంటే యుద్ధం. సుందరకాండలో సీతాదేవిని చూసి ఉంగరం ఇచ్చిరావడమే నాపని, ఇంతమంది రాక్షసులతో యుద్ధం చేయడం నావల్లకాదని హనుమ ఏక్షణంలోనూ ఆలోచించలేదు. రాక్షసవీరులు ఎందరితోనో, అక్షకుమారునితో, ఇంద్రజిత్తుతో భయంకరమైన పోరు సల్పి విజయం సాధించాడు. అందుకే అన్నమయ్య సందేహం లేకుండా 'హనుమంతుడట్టి బంటు' అని పల్లవితో మనకు గుర్తు చేస్తూ ఉంటాడు మధ్యలో.

మూడోచరణంలో: చెప్పినట్లనే నడచిన యాతడే బంటు- ఎలా చెప్తే అలా నడచినతడే బంటు. బంటుకు ఉండవలసిన లక్షణంగా అన్నమయ్య చెప్పాడు. కానీ లోకంలో హనుమ గురించి 'చూచి రమ్మంటే కాల్చివచ్చాడు' అనేమాట లేకపోలేదు. రావణుని ఆజ్ఞమేరకు రాక్షసులు తన తోకకు నిప్పు అంటించడంవల్ల అవకాశాన్ని ఊరికే పోనివ్వడమెందుకని ఆ తోకతో వైరుల కొంపలకు నిప్పు పెట్టాడేగాని బంటు లక్షణానికి భంగం కలగనీయలేదు.

'తప్పులేక హితుడైనతడే బంటు'-

తన నడవడిలో ఎలాంటి దోషము లేకుండా యజమానికి హితము చేయాలనే ఆలోచన కలవాడే బంటు. హితకరమైన పనులు చేసి హితుడు కావడం విశేషం. హనుమ ఎడల రాముడికే కాదు, సీతకుకూడా ఎంతో ఆత్మీయత ఏర్పడినట్లు మనకు రామకథలో స్పష్టంగా తెలుస్తుంది.

'మెప్పించుక విశ్వాసాన మెలగువాడే బంటు'-

ఒకసారి మెచ్చుకున్నారు కదా, ఇక మనం ఏం చేసినా చెల్లుబడి అవుతుందిలే అనే ఆలోచన రానివ్వక, మొదట గల విశ్వాసం అలాగే కలిగి మెలిగినవాడే బంటు.

'ఎప్పుడును ద్రోహిగాని హితుడే బంటు'-

నమ్మించినట్లే నమ్మించి ఒకనాడు ద్రోహం తలపెట్టకుండా-సర్వాత్మనా హితం కోరుతూ-ద్రోహి కానివాడే నిజమైన బంటు-అదిగో అట్టి బంటు హనుమంతుడు.

నాలుగో చరణం: అక్కరగలిగి కడునాప్పుడైనవాడే బంటు- కొంతకాలం బాగా శ్రద్ధగా కొలువుచేసి నిజమైన అవసరం ఏర్పడినప్పుడు శ్రద్ధకలిగి ఆప్తుడై నడచుకునేవాడే బంటు.

'ఎక్కడా విడిచిపోని యిష్టుడే బంటు'- 'ఎక్కడా' అనడంలో విశేషం- రాజ్యంలోగాని, ఇంటగాని, బయటగాని, యుద్ధంలోగాని, అడవిలోగాని-ఏపట్టునా స్వామినివదలి వెళ్ళకుండా తన మనస్సుకు ఇష్టుడై వున్నవాడే నిజమైన బంటు. వీడు వదలి వెళ్ళిపోతే బాగుండును అనే భావన యజమానికి రానివ్వనివాడే బంటు.

'తక్కర రహస్యములు దాచినవాడే బంటు'- సన్నిహితముగా మసలే బంటుకు యజమాని వ్యవహారాలకు సంబంధించిన రహస్యాలు ఎన్నో తెలుస్తాయి. ఆ రహస్యాలను ఎట్టి పరిస్థితులల్లోనూ బయటపెట్టకుండా దాచే వాడే నిజమైనబంటు. 'మీ లోగుట్టులు తెలిసినవాణ్ణి, జాగ్రత్త' అని

ఎదిరించకుండా భక్తితో వ్యవహరించేవాడు బంటు.

'కక్కసీడుగాక బత్తిగలవాడే బంటు'-కక్కసీడు అంటే బాధించేవాడు అని అర్థం. నీరహస్యాలన్నీ నా గుప్పెట్లో ఉన్నాయి. 'నేను ఏమైనా చేయగలను.' అని బెదరించకుండా భక్తివిశ్వాసాలు గలవాడే బంటు. అటిముటి హనుమంతుడు అట్టి బంటు.

ఇక చివరి చరణం అయిదోది: 'కానిపనులకు లోనుకానివాడే బంటు' ధర్మవిరుద్ధమైన పద్ధతికాని పనులకు లోనుకానివాడే బంటు. స్త్రీలు పాడుకొనే రామాయణపు పాటల్లో ఒక చిన్న సంఘటన ఉంది.

రావణుడు తనసభలో మంత్రులసమక్షంలో హనుమంతునుతో 'నువ్వు నాపక్షంలో చేరితే అర్థరాజ్యం ఇస్తా' నని ప్రలోభపెడతాడు. ఉత్తముడైన హనుమ 'నీ రాజ్యమెంత? నువ్వెంత? నాస్వామి ముందు' అంటూ తిరస్కరిస్తాడు. మరి హనుమ స్వభావాన్ని జానపదులే ఇంత ఉన్నతంగా కీర్తించారంటే హనుమ శీలం వెలకట్టలేనిది అన్నమాట. ఏరకమైన ప్రలోభాలకు లోనుకాకుండా కానిపనులు చేయకుండా ఉండడమే బంటు ప్రధాన లక్షణం. అంతేకాదు 'ఆనాజ్ఞమీరని యాతడే బంటు'.

ఆనాజ్ఞ అంటే ఆన + ఆజ్ఞ-ఆనాజ్ఞ. ఆన పెట్టడం అంటే ఒట్టుపెట్టడం. ఆజ్ఞ అంటే ఆజ్ఞాపించడం. ఇలా యజమాని పెట్టిన ఆన, ఆజ్ఞ రెండూ తప్పకుండా నిర్వహించేవాడే బంటు- అంటూ చివరిమాటగా నానాగతి శ్రీ వేంకటోన్నతుడైనయతనికి తానన్నిటా దాసుడైన ధన్యుడే బంటు- ముక్తాయిస్తాడు. నానాగతి అంటే అనేకవిధాలుగా వేంకటోన్నతుడైన యతనికి శ్రీనివాసునికి - తాను అన్నిటా దాసుడైన ధన్యుడే బంటు అని వివరిస్తాడు. దాసుడై ధన్యుడు కావాలంటూ హెచ్చరిస్తున్నాడు. ఇంతకీ ఈ బంటు ఎవరి బంటు? ఎవరికి ఇంత భాగ్యం అంటే-

అటిముటి హనుమతుడట్టి బంటు

వెఱపులేని రఘువీరునికి బంటు-

సత్యపరాక్రముడు, ధర్మ పరాక్రముడు అయిన రఘువీరునికి వెఱపు అనేదేలేదు. అట్టి రఘువీరునికి ఇట్టి బంటు అంటూ ఒక దివ్య భావానుసంధానం చేసాడు అన్నమయ్య!

ఇంతటి మహనీయ గుణోపేతుడైన హనుమ ఎడల అన్నమయ్యకు ఎనలేని ప్రేమ. మితిలేని గౌరవం. ఎన్నెన్నో కష్టబహుళమైన కార్యాలు స్వామికోసం నిరంతరం ఆనందంగా నిర్వహించే ఈ బంటుకు ఎప్పుడు ఏ ఆపద సంభవిస్తుందో అని అన్నమయ్య అంతరంగంలో ఎంతో ఆందోళన పడ్డాడు. ఆ ఆందోళననుండి తాను బయటపడాలన్నా హనుమ క్షేమంగా ఉండాలన్నా భగవద్రక్ష కోరడమే కర్తవ్యంగా భావించాడు.

తల్లి తన బిడ్డకు ఎలాంటి ఆపదా రాకూడదని రక్ష పెడుతుంది. రక్ష కడుతుంది. అరణ్యవాసానికి వెళ్తున్న రామునికి కౌసల్యామాత రక్ష కడుతుంది. త్యాగరాజు హృదయం ఆ తల్లి హృదయంతో కలిసి 'రక్షకట్టరే' అనే కీర్తనగా రూపు దిద్దుకుంది.

నందకులంలో బాలకృష్ణునికి ఎదురౌతున్న ఉత్పాతాలకు భయపడిన మాతృదేవి యశోదాదేవి తన శిశువు వివిధ అవయవాలకు వివిధదేవతలు రక్షకావాలని ప్రార్థిస్తుంది. అవయవాలకే కాదు తన బిడ్డడు వివిధావస్థల్లో ఉన్నప్పుడు-కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడు, పారాడేటప్పుడు, నడిచేటప్పుడు; ఇలా సర్వకాలసర్వావస్థల్లోనూ రక్షించమంటు దేవతామండలికి చేతులు జోడించి విన్నవించుకుంటుంది.

మాతృహృదయావేదనను పోతన్న అద్భుతంగా గుమ్మరించాడు తన రచనలో. పరమాత్మే అయినా సరే ఒక తల్లికి బిడ్డడైన సందర్భంలో ఈ రక్ష పెట్టడం అత్యంత సహజము, సుందరమూ కూడా. అయితే తల్లులు బెంగటిల్లి రక్షకట్టడం సామాన్యం.

ఒక భక్తుడు, బంటు అయిన హనుమమీద వాత్సల్యంతో మరొక భక్తుడు, బంటు అయిన అన్నమయ్య మాతృభావనతో హనుమయ్యకు రక్షపెట్టిన రచన రసరమ్యంగానే కాదు భక్తిగమ్యంగా కూడా ఉంది.

తల్లి అంజనాదేవి అంతరంగంలో తన తనయుడైన హనుమకు నిరంతరం రక్ష పెడుతూనే ఉండవచ్చు. కానీ ఆ రక్ష మౌనంగానే ఉంది. అన్నమయ్య మాత్రం కీర్తనగా కూర్చి, తంబురా శృతి చేర్చి భక్తిభావ తన్మయుడై గొంతెత్తి దేవతాకోటికి వినబడేటట్లుగా గానం చేసి రక్ష పెట్టి రంజిల్లాడు.

రాగం: శంకరాభరణం

ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష

1. మొదలనింద్రుడు నీమోముకెల్లా రక్ష
యిదె నీశిరసునకు నినుడు రక్ష
కదిసి నీకన్నులకు గ్రహతారకాలురక్ష
చెదరని నీమేనికెల్ల శ్రీ రామ రక్ష :ఏలవయ్య:

2. పిరుదువాలమునకు బెడిదపు శక్తిరక్ష
గరుడుడు నీ కరయుగముల రక్ష
గరిమ నీకుక్షికి కరివరదుడు రక్ష
సిరుల నీమహిమకు శ్రీ రామరక్ష :ఏలవయ్య:

3. వడి నీపాదములకు వాయుదేవుడు రక్ష
తొడలకు వరుణుడు తొడుగు రక్ష
విడువని మతికిని వేదరాసులే రక్ష
చెడని నీ యాయువునకు శ్రీ రామ రక్ష :ఏలవయ్య:

4. నలువ నీ గళరక్ష నాలుకకుర్వర రక్ష
అలరు నీ సంధులకు హరుడు రక్ష

పలు నీ రోమములకు బహు దేవతలు రక్ష

చెలగు నీ చేతులకు శ్రీ రామ రక్ష :ఏలవయ్య:

5. అంగపు నీతేజమున కగ్ని దేవుడు రక్ష

శృంగారమునకెల్ల శ్రీ సతి రక్ష

మంగాంబునిధి హనుమంత నీకేకాలము

చెంగట శ్రీ వేంకటాద్రి శ్రీ రామ రక్ష 1.4సం-459 కీర్తన

ఆంధ్రదేశంలో పిల్లలకు తల్లులు స్నానమాడించి శ్రీరామరక్ష పెట్టడం నేటికీ ఉంది. తెలుగు తల్లులు ఏ దేశంలో ఉన్నా ఈ ఆచారం పాటిస్తూనే ఉంటారు.

'శ్రీరామరక్ష-సర్వజగద్రక్ష' అనే భావన భక్తులందరికీ ఉంది. అయితే ఈ కీర్తనలో అన్నమయ్య హనుమంతుని వివిధ అవయవాలకు వివిధదేవతల రక్షను అర్థిస్తూనే ప్రతి చరణం చివర శ్రీరామరక్షను ప్రత్యేకంగా ప్రస్తావించాడు భక్తిప్రపత్తులతో. 'చెదరని హనుమతుని మేనికంతా శ్రీ రామరక్ష' అన్నాడు. సముద్రం దాటినా, కొండలు ఎత్తి వారధికట్టినా, రాక్షసులతో యుద్ధంచేసినా, సంజీవని పర్వతాన్ని ఎత్తితెచ్చినా-హనుమ శరీరం కొంచెమైనా కందకుండా, చెదరకుండా ఉండడానికి శ్రీ రామరక్షే కారణంకదా? ఎన్నెన్నో మహిమలు చూపిన హనుమకు, మహిమలకు శ్రీ రామరక్ష! ముఖ్యంగా 'చెడని నీ యాయువునకు శ్రీ రామరక్ష' అంటూ ఆంజనేయుని చిరంజీవత్వానికి శ్రీ రామరక్షను సాభిప్రాయంగా కీర్తించాడు.

కమలాక్షునర్చించు కరములు కరములు అన్నట్లు హనుమ చేసిన చేతలన్నీ రాజీవాక్షుడైన రామునికోరకే అందుకే అన్నమయ్య 'చెలగు నీ చేతలకు శ్రీ రామరక్ష! అన్నాడుధ్వనిపూర్ణంగా.

చివరగా 'నీకేకాలము'- అంటే సర్వకాలాల్లోను చెంగట వేంకటాద్రి శ్రీ రామరక్ష అంటాడు. శ్రీ వేంకటేశ భక్తాంఘ్రిరేణువైన అన్నమయ్య వేంకటాద్రే కొండంత శ్రీ రామరక్ష అంటాడుఔచితీ పరిమళంతో.

దేవతాసమూహం రక్షకులై పరిరక్షిస్తున్న హనుమ ఈ లోకమెల్లా ఏలాలి. రాముని దీవెన తోడుకావాలి. అంతేకాదు – 'పలుదేవతల రక్షాసమన్వితుడైన నీవు మాకు రక్ష కావాలి' అంటాడు అన్నమయ్య.

చిన్నపిల్లలకు భయం పోవడానికి, ధైర్యంకలగడానికి నేటికీ తల్లిదండ్రులు- ఆంజనేయదండకం చదివి, ఆ ఆంజనేయుని సిందూరం బొట్టుపెట్టి, హనుమ వీరవిక్రమాలు కథలుగా చెప్పి బిడ్డలను పెంచి పెద్దచేస్తున్నారు.

సర్వజగద్రక్షకుడైన శ్రీ రాముని రక్షాకవచం సంపూర్ణంగా ధరించిన హనుమంతుడు మానవకోటికంతా రక్షకుడు కావాలని అన్నమయ్య మహనీయమైన భావన చేశాడు. 'నీలవర్ణహనుమంత నీవు మాకు రక్ష!' ***